# బీఆర్ఎస్‌లోకి వలసల జోరు



వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

## మంత్రి వేముల సమక్షంలో చేరికలు

వేల్పూర్, నవంబర్ 9 : సీఎం కేసీఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన నార్ల అంజయ్య, నార్ల నరహరి, ఎట్టం హన్మాండ్లు యాదవ్‌తోపాటు వివిధ పార్టీల నుంచి వందమంది మంత్రి వేముల సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామంలో కాంగ్రెస్ నుంచి కార్తీక్, నక్క స్వామి, ప్రశాంత్, సాయికుమార్, గాండ్లపేట్ బీజేపీ నుంచి మామిడి శేఖర్, ముద్దం గంగాధర్, కంది శశికుమార్, ఒల్లెపు గణేశ్, చిన్ని గంగాధర్, ముద్దం పెద్దగంగాధర్, ముద్దం అశోక్, ముద్దం బాలు, వేల్పూర్ మండలం జాన్కంపేట గ్రామం నుంచి కుర్మ, యాదవ చైతన్య యూత్ సభ్యులు వొల్లెం మహేశ్, ప్రెసిడెంట్ స్వామి, వైస్‌ప్రెసిడెంట్ రాజశేఖర్, సెక్రటరీ మోహన్, క్యాషియర్, యూత్ సభ్యులు, భీమ్‌గల్ మున్సిపల్ బాపూజీనగర్‌కు చెందిన మైనార్టీ యువకులు, ఏర్గట్ల మండలం తొర్తి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు గంధం వెంకన్న, ముచ్కూర్ నుంచి జాంబవ యూత్ శివగంగ యూత్ సభ్యులు 70 మంది, బీజేపీ సీనియర్ నాయకుడు ఓరగంటి ముత్తెన్న, కార్యకర్తలు గులాబీ గూటికి చేరారు. వారికి మంత్రి వేముల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వేల్పూర్ మండల కేంద్రంలోని మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**నేడు మెండోరా మండలంలో ఎన్నికల ప్రచారం**

మెండోరా, నవంబర్ 9 : మండలంలోని దూద్‌గాం, బుస్సాపూర్, సోన్‌పేట్ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి మంత్రి వేముల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగంపేట్ శేఖర్‌రెడ్డి తెలిపారు.

# మంత్రి వేములకు పలు సంఘాల మద్దతు

## వేల్పూర్‌లో తీర్మాన కాపీల అందజేత



మంత్రికి ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేస్తున్న ముచ్కూర్ శివ గంగ యూత్ సభ్యులు

వేల్పూర్, నవంబర్ 9 : బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేము ప్రశాంత్‌రెడ్డికి విశేష ఆదరణ లభిస్తోంది. పలు కులసంఘాలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నాయి. తాజాగా పలు గ్రామాలకు చెందిన కులసంఘాలు గురువారం వేములకు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు తీర్మానాలు చేశాయి. మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన రజక సంఘం ఒరగంటి పంథా, భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన శివగంగ యూత్ సభ్యులు (గంగపుత్ర) ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. తీర్మాన కాపీలను గురువారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి వేల్పూర్‌లోని ఆయన నివాసంలో గురువారం అందజేశారు.

# నిజామాబాద్ జిల్లాలో 33 నామినేషన్లు దాఖలు

## జిల్లాలో ఇప్పటివరకు 70 నామినేషన్లు..

ఖలీల్‌వాడి, నవంబర్ 9 : రాష్ట్ర శాసనభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి గురువారం 33 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఆర్మూర్ సెగ్మెంట్ నుంచి ఎస్కే మాజిద్ (మజ్లిస్ బచావో త్రెహీక్), ఆశన్నగారి జీవన్‌రెడ్డి (బీఆర్ఎస్), తాళ్లపల్లి శేఖరయ్య (విద్యార్థుల రాజకీయ పార్టీ), గండికోట రాజన్న (బీఎస్పీ), పి.వినయ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్) నామినేషన్లను సమర్పించారని తెలిపారు. బోధన్ సెగ్మెంట్ నుంచి పి.సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్), మోసిన్ (ఎం-సీపీఐ), డి.నాగరాజు (ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్), వి.మోహన్‌రెడ్డి (బీజేపీ), మహ్మద్ షకీల్ ఆమేర్ (బీఆర్ఎస్), షేక్ జలీల్ (స్వతంత్ర), సాయం మురళి (స్వతంత్ర) అభ్యర్థులుగా నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. బాన్సువాడ సెగ్మెంట్ నుంచి పరిగె భాస్కర్‌రెడ్డి (స్వతంత్ర), పందిర గంగామణి (స్వతంత్ర) అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు.

అర్బన్ నియోజకవర్గం నుంచి మహ్మద్ షబ్బీర్ అలీ (కాంగ్రెస్), బి.లలిత (స్వతంత్ర), పడకంటి రాము (స్వతంత్ర), దత్తురాం ఖతల్ (రాష్ట్రీయ సమాజ్ పక్ష), దండి లత (బహుజన్ లెఫ్ట్ పార్టీ), బిగాల గణేశ్ గుప్తా (బీఆర్ఎస్), ఫజల్ కరీం (ఎన్సీపీ), మహేశ్ బిగాల (బీఆర్ఎస్), ఎం. శివకుమార్ (స్వతంత్ర), ధన్‌పాల్ సూర్యనారాయణ (బీజేపీ), మహ్మద్ మన్సూర్ అలీ (అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారని వివరించారు. నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్ఎస్), బాజిరెడ్డి జగన్మోహన్ (స్వతంత్ర), ఆర్. భూపతిరెడ్డి (కాంగ్రెస్), ఎం. శేఖర్ (బీఎస్పీ) అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గం నుంచి వేముల ప్రశాంత్‌రెడ్డి (బీఆర్ఎస్), పల్లికొండ నర్సయ్య (బహుజన సమాజ్‌పార్టీ) ఎం. భోజన్న (ధర్మసమాజ్ పార్టీ), ముత్యాల సునీల్ కుమార్ (కాంగ్రెస్) అభ్యర్థులుగా నామినేషన్ వేశారని వివరించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 70 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. ఆర్మూర్ సెగ్మెంట్ నుంచి ఇప్పటివరకు 11 నామినేషన్లు, బోధన్ సెగ్మెంట్ నుంచి 13, బాన్సువాడ నుంచి 8, నిజామాబాద్ అర్బన్ నుంచి 21, నిజామాబాద్ రూరల్ నుంచి 10, బాల్కొండ నుంచి 7 నామినేషన్లు దాఖలైనట్లు వివరించారు.

# తెలంగాణ యూనివర్సిటీలో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఐఐఏఎం మీడియేటర్ కేఎస్.శర్మ

డిచ్‌పల్లి, నవంబర్ 9 : టీయులోని న్యాయశాస్త్ర కళాశాలలో 'కోర్టు కేసుల్లో మధ్యవర్తిత్వం - సవాళ్లు' అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌నకు ముఖ్యవక్తగా ఐఐఏఎం మీడియేటర్ కేఎస్.శర్మ హాజరై మాట్లాడారు. న్యాయస్థానాల్లో లిటిగేషన్ అనేది కాలాన్ని, ధనాన్ని వృథా చేస్తుందని, మానవీయ సంబంధాలను దూరం చేస్తుందని అన్నారు. మధ్యవర్తిత్వం సమస్యను పరిష్కరించి, స్నేహపూరితమైన వాతావరణాన్ని నెలకొల్పుతుందన్నారు. మంజీరా వెంకటేశ్ మాట్లాడుతూ.. పంతాలు, పట్టింపులు అనేక సమస్యలను సృష్టిస్తున్నాయని, అవి మధ్యవర్తిత్వంతోనే పరిష్కరించుకోవాలని అన్నారు. వర్క్‌షాప్‌కు న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నరాణి అధ్యక్షత వహించారు. వర్క్‌షాప్ నిర్వహించినందుకు ఫ్యాకల్టీని రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి అభినందించారు. న్యాయ కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా, వైద్యులు బి.స్రవంతి, నాగజ్యోతి, రామలింగం, నర్సయ్య, ప్రవీణ్, విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

# ప్రజలకు చట్టాలను తెలియజేయడమే లక్ష్యం




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీ కల్మేశ్వర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

- సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల
- జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ

నిజామాబాద్ లీగల్, నవంబర్ 9 : చట్టాలను ప్రజలకు తెలియజేయడమే న్యాయసేవాధికార సంస్థ ప్రధానలక్ష్యమని సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని గురువారం నిర్వహించారు. నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్‌తో కలిసి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. న్యాయసేవా సంస్థ.. న్యాయసేవలతోపాటు సామాజిక సేవ అందజేస్తున్నదని అన్నారు. ప్రజల కోసం రూపొందించిన చట్టాలు, ప్రజల దరికి చేరే విధంగా ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. చట్టాలను అందరూ గౌరవించాలని కోరారు. చట్టవ్యతిరేకమైన చర్యల వల్ల వ్యవస్థతో పాటు వ్యక్తులకు నష్టం వాటిల్లుతుందని, చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ర్యాలీలో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జిలు పద్మావతి, శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జి గోపీకృష్ణ, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చాండక్ దేవదాసు, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, అడిషనల్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లు జయరాం, కిరణ్ కుమార్, సీఐలు విజయ్‌బాబు, నరహరి, సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్, కాకతీయ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రామారెడ్డి, నవంబర్ 9: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన రామారెడ్డిలో గురువారం వెలుగుచూసింది. స్థానిక ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన కంలవాడి సంజీవ్(33) రామారెడ్డిలోని దుర్గా వైన్స్‌లో విస్కీ తీసుకున్నాడు. దాని వెనుకాల ఉన్న పర్మిట్ రూమ్‌లో తాగుతూ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు తరలిన క్రీడాకారులు

డిచ్‌పల్లి, నవంబర్ 9 : టీయూ పురుషుల జట్టు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు గురువారం తరలివెళ్లింది. ఈనెల 12 నుంచి కాకినాడలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌లో వీరు పాల్గొననున్నట్లు వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్ తెలిపారు. కబడ్డీ జట్టుకు మేనేజర్‌గా డాక్టర్ బీఆర్.నేత, కోచ్‌గా ప్రశాంత్‌ను నియమించినట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో టీయూ జట్టు ప్రతిభ చూపాలని అధ్యాపకులు ఆకాంక్షించారు.



టోర్నమెంట్‌కు తరలుతున్న టీయూ కబడ్డీ జట్టు